క్లుప్తంగా

శ్రీనివాస్‌కు పరామర్శ



శ్రీనివాస్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఆకివీడు: మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొక్కా శ్రీనివాస్‌ను బుధవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పరామర్శించారు. మాతృమూర్తి మరణం తీరని లోటు అని త్వరగా ఈ బాధ నుంచి కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గుండా సుందర రామనాయుడు, పట్టణ కమిటీ అధ్యక్షుడు అంబటి రమేష్, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కీ, సీనియర్ నాయకుడు కురెళ్ల పోలు, కట్టా శ్రీను తదితరులు ఉన్నారు.

డీఎన్నార్‌లో సైబర్ సెక్యూరిటీపై వర్క్‌షాప్



భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రోహిత్

భీమవరం: భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో సైబర్ సెక్యూరిటీపై రెండు రోజుల వర్క్ షాప్ బుధవారం ప్రారంభమైంది. ఈసందర్భంగా హైదరాబాద్‌కు చెందిన రపీడ్‌స్కిల్ సంస్థ ప్రతినిధి తాడికొండ రోహిత్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ అంశాలపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన, రియల్ టైమ్ అప్లికేషన్స్‌పై శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. సైబర్ సెక్యూరిటీ అంశాలైన డేటా ఉల్లంఘనలను నివారించడం, ఆర్థిక లావాదేవీలను రక్షించడం, భద్రతా సూత్రాలను అర్థం చేసుకోవడం, సున్నితమైన సమాచార రక్షణను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ప్రిన్సిపల్ ఎం అంజన్ కుమార్, జి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఎన్ కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదా సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న పాలకవర్గం

భీమవరం: పట్టణంలోని సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు అటానమస్ స్టేటస్ లభించిందని కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ముత్యాల వెంకటేశ్వరరావు(రత్నం), డాక్టర్ చీడే సత్యనారాయణ చెప్పారు. బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సీఎస్ఎన్ విద్యాసంస్థలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివిధ రకాల కోర్సులతో విద్యనందిస్తున్నామని 1991లో విద్యాసంస్థను ఏర్పాటు చేయగా 1992లో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగినట్లు చెప్పారు. 2024లో నాక్ ఏ గ్రేడ్ లభించగా తాజాగా అటానమస్ హోదా లభించడంతో యూనివర్శిటీ స్థాయికి కళాశాల చేరుకుందన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ సకుమళ్ల సత్యనారాయణ, పాలకవర్గ సభ్యులు వడుపు గోపి, గాదిరాజు సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలు బిడ్డకు ఆరోగ్యం



గర్భిణులకు, బాలింతలతో ఇన్‌చార్జి కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఇవ్వడంతో ఆమెకు క్యాన్సర్ వంటి వ్యాధులు దూరమవుతాయని ఇంచార్జ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా బుధవారం భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్ ఫంక్షన్ హాల్ నందు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తారీకు నుంచి ఏడో తారీఖు వరకు ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలో తల్లిపాలు ఇస్తే అదే దివ్య ఔషధం అని, దీనిని ప్రతి తల్లి కూడా పాటించాలన్నారు. తల్లిపాలు ఎంత శ్రేష్ఠమంటే బిడ్డ ఎదుగుదలకి, ఆరోగ్యంగా ఉండటానికి తల్లిపాలు ఒక్కటే ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారి శ్రీలక్ష్మి, భీమవరం ఆర్డీవో కే ప్రవీణ్ కుమార్ రెడ్డి, డీఈఓ డాక్టర్ దేవ సుధా లక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, రామలింగరాజు, మెంటే పార్థసారథి, సుశేషన ఫౌండేషన్ ప్రతినిధులు రామ్ మాధవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పోషణతోనే పాడి అభివృద్ధి

- మేత విషయంలో జాగ్రత్తలు అవసరం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు సంవర్థక శాఖ



గునుపూడిలో పచ్చిక మేస్తున్న పశువులు



ఆవుకు వ్యాక్సిన్ వేస్తున్న మండల పశు వైద్యాధికారి పి. పుండరీబాబు (ఫైల్)

భీమవరం అర్బన్: రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా లక్షలాది రూపాయలు విలువ చేసే పశువులను అనుబంధంగా పోషణ సాగించడం ప్రధాన వృత్తిగా ఉంటుంది. దీంతో అదనపు ఆదాయం సమకూరడంతో ఆర్థికాభివృద్ధిని పొందుతాడు. పాడికి అన్ని రకాల పచ్చి, ఎండు గడ్డి అందించి రాత్రులు దోమలు కుట్టకుండా దోమ తెరలు ఏర్పాటు చేసి ఫ్యాన్‌లు పెట్టి రైతులు తమ పశువులను సొంత బిడ్డల మాదిరిగా సాకుతాడు. భీమవరం మండలంలో 9వేల 232 గేదెలు ఉండగా వాటిలో 3వేల 126 ఆవులు ఉన్నాయి. భీమవరం అర్బన్‌లో 2 వేల 500 పశువులు ఉండగా వాటిలో 1200 ఆవులు ఉన్నాయి. ప్రస్తుతం సీజన్ మారుతోంది. నెమ్మదిగా వర్షాలు మొదలవుతున్నాయి. ఈ నేపథ్యంలో పశువులు జబ్బుల బారిన పడకుండా ఉండాలనే అనేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా వాటికి పోషకాహారం అందజేయాలి. అప్పుడు పశు సంపద వృద్ధి చెందుతుంది. పశువులకు తగిన మోతాదులో పిండి, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, నీరు అవసరమని భీమవరం మండల పశు వైద్యాధికారి పి. పుండరీబాబు సూచిస్తున్నారు.

పశువులకు రోగనిరోధక పెరగడానికి

పశువుల ఎదుగుదలకు, రోగనిరోధక శక్తికి మాంసకృత్తులు ఎంతో అవసరం. పెయ్యల ఎదుగుదలకు, పాడి పశువుల్లో పాల దిగుబడికి దోహదపడతాయి. ఇవి ఆహారంలో లోపిస్తే పశువులు చిక్కిపోవడం, పెరుగుదల స్తంభించడం, అండాశయం చిన్నగా ఉండటం, ఆలస్యంగా యుక్త వయసుకు రావడం, వ్యాధి నిరోధక శక్తి తగ్గడం, కండరాల బలహీనత, వంటి సమస్య ఉత్పన్నమవుతాయి. పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వంటివి పప్పు జాతికి చెందిన పశుగ్రాసాల్లో విటమిన్లు సమృద్ధిగా లభిస్తాయి.

పశువులకు దెబ్బల నుంచి రక్షణ

పశువుల శరీరంలో కొవ్వు నిల్వలు అంతర్గత అవయవాలను దెబ్బల నుంచి కాపాడతాయి. శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరిస్తాయి. ఆహారంలో రుచిని పెంపొందిస్తాయి. కొవ్వు, పిండి పదార్థాల కన్నా రెండున్నరెట్లు అధిక శక్తినిస్తాయి. వేరుశనగ పిండి, కొబ్బరిపిండి, నూనె గింజల చెక్క, గోధుమ తవుడు, వరి తవుడులో కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి.

నీరు అత్యంత అవసరం

పశువులు నీరు లేకుండా ఐదు రోజులకు మించి బతకలేవు. నీరు శరీర జీవన ప్రక్రియకు, ఉత్పాదకతకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారంలోని వివిధ పోషక పదార్థాలను సంగ్రహించడానికి పోషక పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు శరీరంలోని వివిధ భాగాలకు చేర్చడానికి, శరీర ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించడానికి, శ్వాస ప్రక్రియ కొనసాగాడినిక శరీర ద్రవాల పీచు సాధారణ స్థాయిలో ఉంచేందుకు చర్మం సాగే గుణం కలిగియుండటానికి, జీర్ణక్రియలో ఉపయోగపడే కొన్ని ఎంజైముల తయారీకి, వ్యర్థ పదార్థాల విసర్జన క్రియకు నీరు దోహదపడుతుంది. శరీరంలోని కొవ్వు పదార్థాలు, పిండిపదార్థాల ఆక్సిడేషన్ వల్ల కూడా అర లీటరు నుంచి లీటరు వరకు నీరు ప్రతి పోషక పదార్థం తరపున లభ్యమవుతంది. శరీరంలో నీరు తక్కువైతే చర్మం పొడిగా మారడం, మూత్ర సంబంధ వ్యాధులు, అజీర్తి, మలబద్ధకం తదితర సమస్యలు ఉత్పన్నమవుతాయి. పశువుకు రోజుకు 50 నుంచి 60 లీటర్ల వరకు నీరు అవసరం అవుతాయి.

పాడిని పోషిస్తేనే అధిక పాల ఉత్పత్తి



రైతులు వ్యవసాయంతో పాటు పాడి పోషిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. పశువులకు పచ్చి, ఎండు గ్రాసంతో పాటుగా పత్తి గింజలు, కొబ్బరి పిండి, వేరుశనగ పిండి, నువ్వుల పిండి, చేపల పొడి వాటిని దాణాగా పెడితే అవి వ్యాధి నిరోధక శక్తితో బలంగా ఉంటాయి. దీంతో పాలదిగుబడి అధికంగా ఉత్పత్తి చేస్తాయి. పాడి పోషణపై రైతులతో పాటు పశుపెంపకం దారులకు అవగాహన కల్పిస్తున్నాం.

పి. పుండరీబాబు, పశు వైద్యాధికారి, భీమవరం మండలం

మద్యం సేవించిన నలుగురికి జరిమానా

భీమవరం: మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న నలుగురికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు చొప్పున భీమవరం స్పెషల్ జ్యూడిషియల్ 2వ తరగతి మెజిస్ట్రేట్ ఎంవీఎస్ రాజారావు జరిమానా విధించినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు చెప్పారు. మంగళవారం రాత్రి వన్‌టౌన్ పరిధిలో స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా ఇద్దరు ఆటో డ్రైవర్లు, 12 మంది ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశామన్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి నలుగురికి జరిమానా విధించారని సీఐ చెప్పారు.

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఉండి: అధిక కట్నం తేవాలంటూ మహిళ వేధింపులకు గురికావడంతో పోలీసులను ఆశ్రయించింది. వారు తెలిపిన వివరాల ప్రకారం ఉండి పెదపేటకు చెందిన గుండుగొల్లు దివ్య, గుండుగొల్లు సాల్మన్‌రాజు భార్యాభర్తలు. వీరికి ఒక కొడుకు ఉన్నాడు. అయితే వివాహానంతరం మద్యానికి, చెడు అలవాట్లకు బానిసైన సాల్మన్‌రాజు శారీరకంగా, మానసికంగా తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు అతనికి అత్తమామలు, ఆడపడుచు సహకరిస్తున్నారని దివ్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఎండీ నసీరుల్లా వివరించారు.

త్రిసభ్య కమిటీల ఎంపిక

ఆకివీడు: ఆకివీడు రూరల్ బ్యాంక్, చెరుకుమిల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘానికి త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేశారు. ఆకివీడు రూరల్ బ్యాంక్‌కు చైర్మన్‌గా ముత్యల వెంకటేశ్వరరావు(రత్నం) డైరెక్టర్లుగా మద్రివాడ వెంకట్రావు, ఊడిగ శ్రీనివాసరావు, చెరుకుమిల్లి సొసైటీకి చైర్మన్‌గా కనుమూరు రామకృష్ణంరాజు, దాట్ల సీతారామరాజు, తాటిపర్తి వెంకటేష్‌లను నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

హామీలను నమ్మి లబోదిబోమంటున్న ప్రజలు

పీవీఎల్ నర్సింహరాజు



ఉండిలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: ప్రజలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ఇచ్చిన హామీలను నమ్మి లబోదిబోమంటున్నారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం ఉండి పడవలరేవు ప్రాంతంలో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గా మహంకాళి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే ఆంజనేయరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి హామీల బ్రోచర్‌ను చూపించి మీకు సూపర్ సిక్స్ పథకాలు కూటమి ప్రభుత్వం ఇచ్చిందా? లేదా? అని ఆరా తీశారు. దీంతో చాలా మంది ఏదో చేస్తారని అనుకుంటే అంతా మోసం చేశారని సమాధానమిచ్చారు. అనంతరం పీవీఎల్ మాట్లాడుతూ అధికారం కోసం అడ్డదిడ్డంగా హామీలిచ్చారని, ఇప్పుడు వాటిని నెరవేర్చమంటే స్వయానా మంత్రులే రాష్ట్రాన్ని అమ్మేయాలంటూ ప్రజలను తక్కువ చేసి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు ఎంత నష్టపోయారో వారికి తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఇంటింటికీ రేషన్ విధానాన్ని రద్దు చేసి ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని దుయ్యబట్టారు.

కొత్త పింఛన్లు ఇంకెప్పుడు ఇస్తారు?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ కొత్త పింఛన్లు ఇవ్వలేదని పీవీఎల్ మండిపడ్డారు. స్పౌజ్ పింఛన్లనే కొత్త పింఛన్ల తరహాలో హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. స్పౌజ్ పింఛన్లు కాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంత మంది వికలాంగపింఛన్లు, వితంతు పింఛన్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేశారు? అని ప్రశ్నించారు. 50 ఏళ్లకే పింఛన్లు అన్నారని ఎంత మందికి ఇచ్చారు? అని మండిపడ్డారు. కార్యక్రమంలో జి.సుందర్ కుమార్, బడుగు బాలాజీ, గులిపల్లి అచ్చారావు, గలావిల్లి ధనుంజయ, బేతాళ పుష్ప, అంగర రాంబాబు, కరిమెరక శివనాగరాజు, కరిమెరక మల్లికార్జున, శేషాద్రి శ్రీను, వెలగపల్లి టోనీ, కాటినాగేశ్వరరావు, ఆర్‌కే, మహేష్, అంగర సునీల్, గెద్దా రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన



భీమవరం ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో పర్యావరణ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

భీమవరం: విద్యార్థులకు చిన్నతనం నుంచే ఉపాధ్యాయులు పర్యావరణంపై అవగాహన కల్పించడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని సమర్థవంతంగా అరికట్టవచ్చునని ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలో ఏఆర్ కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రజలంతా చైతన్యవంతులై సహరించాలన్నారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పీబీ శ్రీనివాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాము, ఏకే మహాలక్ష్మి, వేల్పుల నాగేశ్వరరావు, చిట్టి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య పరిష్కరించాలని నిరసన



పైప్‌లైన్ వాల్ మూసివేయవద్దని నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలోని పలు వీధులకు ఉదయం 8 గంటల ప్రాంతంలో కుళాయి నీటి సరఫరాను నిలుపుదల చేయడంపై ఆ ప్రాంత వార్డు కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి, సీపీఎం నాయకులు, మహిళలు పైప్‌లైన్ వాల్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్థానిక దుంపగడప గేటు వద్ద ఉన్న పైప్‌లైన్ వాల్ వద్ద బుధవారం నిరసన తెలుపుతూ కమిషనర్ సంఘటనా స్థలానికి రావాలని నినాదాలు చేశారు. సీపీఎం నాయకులు బీవీ వర్మ, డోకల రవితేజ, కె.తవిటినాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో కుళాయి నీరు ఉదయం 6 గంటలకు ఆ తరువాత 8 గంటలకు వదులుతుండేవారని, గత రెండు నెలలుగా నీటిని విడుదల చేయకుండా వేరే ప్రాంతానికి సరఫరా చేయడంతో నీటి ఎద్దడి తీవ్రమైందని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై కమిషనర్‌కు పలు సార్లు వినతి పత్రం అందజేసినప్పటికీ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు నిలుపుదల చేశామని చెబుతున్నారన్నారు. వాల్ వద్ద నిరసన వ్యక్తంచేయడంతో 8 గంటల ప్రాంతంలో ఓహెచ్ఎస్ఆర్ నుండి నీటి సరఫరానే బంద్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల గొంతు ఎండే విధంగా చర్యలు తీసుకోవడం తగదని కౌన్సిలర్లు అప్పారావు, శ్రీనివాసరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిరోజూ కుళాయి ద్వారా 8 గంటలకు కూడా నీటిని విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సందక సూర్యకుమారి, గేదల లావణ్య, సందక సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులను అడ్డుకున్నారని కేసు నమోదు

ఆకివీడు: స్థానిక జవహర్‌పేటలో తమ ఉద్యోగుల విధులకు పలువురు ఆటంకం కల్పించారని కమిషనర్ జి.కృష్ణమోహన్ చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు రైటర్ డీవీ రమణ విలేకరులకు తెలిపారు. స్థానిక జవహర్ పేటలోని పలు వీధుల్లో మంచినీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని కౌన్సిలర్లు గేదల అప్పారావు, పడాల శ్రీనివాసరెడ్డి, బీవీ.వర్మ, లావణ్య, సందక సూరిబాబు, మరో 7 మహిళలు ఉద్యోగుల విధులకు ఆటంకం కల్పించారని కమిషనర్ ఫిర్యాదు చేశారన్నారు.

ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలి



భీమవరంలో హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు

భీమవరం: వేగం కన్నా ప్రాణం మిన్నగా భావించి హెల్మెట్ ధరించి డ్రైవింగ్ చేయడం ఎంతో ప్రయోజనమని భీమవరం ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనం వద్ద ఏర్పాటు చేసిన హెల్మెట్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం ఎంతో ప్రమాదకరమని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ వాడకం పట్ల అవగాహన కల్పించడానికి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. అనంతరం పలువురికి ఉచితంగా హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి, మానవతా సంస్థ ఆత్మీయ సహకార కమిటీ చైర్మన్ ఎస్‌కే చాన్‌భాషా, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాతల జేమ్స్, అల్లు శ్రీనివాస్, న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసిం, ట్రాఫిక్ ఎస్ఐ గగారిన్, దుగ్గిరాల శ్రీను, మైలే రాజు, గోగుల మండ కుమార్, కట్టా రాంబాబు, మహమ్మద్ నౌషాద్ తదితరులు పాల్గొన్నారు.

స.హ చట్టంపై అవగాహన అవసరం



సమాచార హక్కుచట్టంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ డా.వై.నూకరాజు తెలిపారు. భీమవరంలోని జిల్లా ప్రకృతి వ్యవసాయం సిబ్బందికి సమాచార హక్కు చట్టం పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం యొక్క ఆవశ్యకత, ప్రయోజనాలు, దాని ప్రాముఖ్యతపై సమగ్రమైన అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం 2005, ప్రజలకు ప్రభుత్వ శాఖల నుంచి సమాచారం పొందే హక్కును కల్పిస్తుందని, ఇది పారదర్శకత, నైతికత, జవాబుదారీ తనాన్ని పెంపొందించేందుకు ఒక శక్తివంతమైన సాధనంగా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలు నేరుగా వారి సమస్యలకు పరిష్కారం కోరుతూ, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల వినియోగం వంటి అంశాలపై ప్రశ్నించవచ్చని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుందని, ప్రతి ఉద్యోగి ఈ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు అవసరమైన సమాచారాన్ని సమయానికి ఇవ్వడంలో నిర్లక్ష్యం చేయకూడదని తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ చోరీపై కేసు

ఆకివీడు: సిద్ధాపురంలో జూన్ 12న తన మోటారు సైకిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారని గండికోట దుర్గారావు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు బుధవారం కేసు న మోదు చేసినట్లు ఎస్సై హనుమంతు నాగరాజు తెలిపారు.

బాలా త్రిపుర సుందరిదేవికి 100 గ్రాముల వెండి సమర్పణ



అమ్మవారికి వెండి సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి బుధవారం దాతలు 100 గ్రాముల వెండి విరాళంగా అందించారు. పట్టణానికి చెందిన కూరకుల దుర్గాప్రసాద్, ఇందు దేవి దంపతులు 100 గ్రాముల వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి దాతలకు ఆశీర్వచనాలు అందించి సత్కరించారు. వెండి పీఠానికి దాతలందిస్తున్న సహకారానికి ధన్యవాదములు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

In the Court of the Hon'ble Civil Judge (Senior Division), Bhimavaram
Cr.I.P.No.25/2025

Between
Petitioner :
Nallapuraju Mohan Krishnam Raju & Others
And
Respondents :
1.**Nethala Yudayya** S/o Yakobu, 3rd Floor in 3rd Building Mahathma Gandi Nagar, Rayalam, Bhimavaram Mandal, Cell:63045 93386
2.**Smt.Naraharisetti Venkata Satya Anusha** W/o Devi Veera Madhusudan, Panchadara Vari Street, Rayalam, Bhimavaram Mandal.
3.**The Official Reciever, West Godavari District**, District Court Premises, Eluru.

పై నెంబరు పిటీషనరు శ్రీ భీమవరం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో పై నెంబరు Cr.I.P.No.25/2025 దాఖలు చేసియున్నారు. [illegible] దీ.18-08-2025 [illegible]

పిటీషనరు తరుపు అడ్వకేట్స్
శ్రీమతి ఎస్.ఎస్.విజ్ఞాన దేవి
అడ్వకేట్, భీమవరం
సెల్: 99988 73844
యం.కృష్ణచైతన్య
అడ్వకేట్, సెల్: [illegible]
భీమవరం,
2.06-08-2025

చినమిల్లి పరామర్శలు



రాంబాబును పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ భీమవరం నియోజవర్గ ఇన్‌చార్జ్ చినమిల్లి

వీరవాసరం: మండలంలోని బాలేపల్లి గ్రామానికి చెందిన దూసనపూడి రాంబాబు తండ్రి దోసనపూడి సోమన్న గుండెపోటుతో ఇటీవల మరణించారు. బుధవారం వారి కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ భీమవరం నియోజవర్గం ఇన్చార్జి చినమిల్లి వెంకట రాయుడు పరామర్శించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ చవ్వాకుల సత్యనారాయణ, నేతల జ్ఞానసుందర్రాజు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సేవలు అభినందనీయం



వీరవాసరం హైస్కూల్‌కు కుర్చీలు బహూకరిస్తున్న 1986-87 పూర్వపు విద్యార్థులు

వీరవాసరం: పూర్వ విద్యార్థుల సేవలను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఈఓ రమేష్ తెలిపారు. అవకాశం ఉన్న ప్రతి పూర్వపు విద్యార్థి తాము సంపాదించిన దాంట్లో ఎంతో కొంత తమ పాఠశాల అభివృద్ధికి సహాయం చేయాలని ఆయన తెలిపారు. 1986-87 పదో తరగతి పూర్వపు విద్యార్థులు బుధవారం రూ.15వేలు విలువ చేసే 25 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జుత్తిగ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ హైస్కూల్ విద్యనభ్యసించిన అనేక మంది విద్యార్థులు ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. ఇదే హైస్కూల్ నందు విద్యనభ్యసించి ఇదే హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ నేటి విద్యార్థులకు డిప్యూటీ డీఈఓ రమణ ఆదర్శంగా ఉంటున్నారన్నారు. అటువంటి వారంతా తాము చదివిన పాఠశాలను గుర్తుంచుకుని పాఠశాల అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యెలూరి భానుకుమారి, శనివారపు ప్రసాదు, ముద్రగళ శ్రీనివాసరావు, పంతం రాము, వెంకటలక్ష్మి, సన్యాసిరావు, చల్లా రావు, నాగు, చిట్టిబాబు, జయకృష్ణ పాల్గొన్నారు.